క్లుప్తంగా

శివనామ స్మరణతో మార్మోగిన కాకర్లపహాడ్



నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్‌లో మంగళవారం శివమాలధారులు పడిపూజ నిర్వహించారు. లోకిరేవుకు చెందిన వీరన్న గురుస్వామి చేతుల మీదుగా జరిగిన ఈపూజలో శివస్వాములు అధికసంఖ్యలో పాల్గొన్నారు. శివనామ స్మరణతో కాకర్లపహాడ్ గ్రామం మార్మోగిపోయింది. భక్తులు పాల్గొని జ్యోతిర్లింగాలకు పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి నరేష్, రఘు, శ్రీకాంత్, శివ, చరణ్, శివకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా శివ భక్తులు

భూత్పూర్: మహా శివరాత్రి పురస్కరించుకొని శివమాలధారులు, భక్తులు వందలాది మంది పాదయాత్రగా శ్రీశైలానికి తరలివెళ్తున్నారు. కర్ణాటక, చించోలితో పాటు నారాయణపేట, కొడంగల్ నుంచి భక్తులు వెళ్తున్నారు.

తపస్ కమిటీ ఎంపిక

మిడ్జిల్: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సమావేశంలో మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా శివప్రసాద్‌ను ఎంపిక చేశారు. నాయకులు బాబునాయుడు, మోహన్, సరస్వతి, కరుణాకర్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అధికారుల బృందం పర్యటన

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతికాలనీ, నల్లకుంట, వెంకటేశ్వర కాలనీ, మాధవరావు కాంపౌండ్‌ల్లో హైదరాబాద్‌కు చెందిన మున్సిపాలిటీ పబ్లిక్‌హెల్త్, ఇంజనీరింగ్ విభాగం అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ డీఈ మల్లేష్, ఏఈ వినోద్ పైకాలనీల్లో పర్యటించి వర్షాకాలంలో నీటిముంపునకు గురికాకుండా తీసుకునే చర్యలపై పరిశీలించారు. రూ.14కోట్లు ఇందుకు విడుదల కాగా చేపట్టే పనులకు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. పట్టణంలో 3కి.మీ మేర పొడవు 12ఫీట్ల వెడల్పుతో మురికి కాల్వ, నాలాలు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

జేపీఎన్‌సీలో అవగాహన కార్యక్రమం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వివిధ దేశాల్లో ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందేందుకు టామ్కో సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జర్మనీలో ఎలక్ట్రీషియన్, బస్‌డ్రైవర్, టెక్నీషియన్ ఉద్యోగాలు చేసేందుకు పలువురు విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, టామ్కో ప్రతినిధులు శావణి, అజయ్, వివేక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మిడ్జిల్: మండల కేంద్రంలోని 167 జాతీయ రహదారిపైన 133 కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మోటార్ సైకిళ్లపై ఉన్న బీదర్‌కు చెందిన శంకర్, చాదర్‌పల్లికి చెందిన శ్రీను, మరో వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108లో జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



జడ్చర్ల టౌన్: పురాతన వెంకటేశ్వరస్వామి ఆలయంలో 9 రోజులుగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గరుడ, శేషవాహనాలపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ కోనేరు వద్ద పండితుల మంత్రాల మధ్య మధ్య చక్రతీర్థం ఘనంగా జరిపించారు. దీంతో ఉత్సవాలు ముగిశాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నరహరి భీంసేనాచార్యులు ప్రకటించారు.

విద్యార్థినులకు సన్మానం

హన్వాడ: స్థానిక మహాత్మాజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు జాతీయస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ పోటీల్లో సత్తాచాటారు. అండర్-19 పోటీల్లో పాల్గొన్న వర్షిణి కాంస్యపతకాన్ని సాధించింది. శశికళ, అంజలి, భువనేశ్వరీ ట్రయల్స్‌కు ఎంపికయ్యారు. వీరిని జిల్లా అండర్19 స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పాపిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వందన ఘనంగా సన్మానించారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- 128 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గానికి సంబంధించి 128మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే ఉద్దేశంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకున్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నట్లు తెలిపారు. రూ.5లక్షలుగా ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచారన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు మహేందర్, సాయిబాబా, అజ్మత్‌అలీ, రాములు యాదవ్, ఖాజాపాష, రాషెద్‌ఖాన్, ప్రశాంత్, అంజద్, బండి మల్లేష్, అష్వాక్, మొయిజ్, రఘు, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యా నిధికి విరాళం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యానిధికి తమ ఒక్కరోజు వేతనం రూ.57,047 చెక్కును ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కు అందజేశారు. ఈ సందర్భంగా విద్యానిధికి ఒక్క రోజు వేతనాన్ని ఇచ్చిన ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భగవంతాచారి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ , హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, ప్రవీణ్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసన్న గంధోత్సవం



అప్పంపల్లిలో గంధం ఊరేగింపు

చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామంలో అబ్దుల్ రహమాన్(మాసన్న) ఉర్సులో భాగంగా మంగళవారం గంధోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి గ్రామంలోని దర్గా నిర్వాహకుల ఇంటి దగ్గరనుంచి మేళా తాళాల మధ్య గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. అనంతరం ఖవాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అజ్మీర్ ఖాజ గరీబ్ నవాజ్ దర్గా షరీఫ్ వజీర్ హుసేన్‌సాబ్, తాండూర్ ఖరింషా దర్గా పీఠాధిపతి సాబేర్ పాషా, దుప్పల్లి అబ్దుల్ రహీం ఉర్సు ఖలందరి రాంచంద్రయ్య, దర్గా పీఠాధిపతులు కరుణాకర్‌గౌడ్, రవిగౌడ్ ఉర్సు నిర్వాహకుడు శంకర్, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, బోయ నర్సింహులు, రాఘవరెడ్డి, కుర్వశ్రీను, బోయ చందు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి



ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి

గండేడ్: కార్యాలయంలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి ఉద్యోగులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాష్‌బుక్, ఆదాయ వ్యయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆడిట్ నివేదికల్లో ఉన్న అభ్యంతరాలను వెంటనే క్లియర్ చేసుకోవాలని సూచించారు. గ్రామపరిపాలనా వ్యవస్థ పటిష్టంగా కొనసాగేలా అధికార యంత్రాంగం మసులుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవన్న, సూపరింటెండెంట్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను సన్మానిస్తున్న వినోద్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్, ఇతర క్రీడల్లో ప్రతిభచాటాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. నారాయణపేటలో ఇటీవలే జరిగిన 24వ జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా విద్యార్థులను మంగళవారం జిల్లా కేంద్రంలో వినోద్‌కుమార్ అభినందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌తో మానసికంగా ధృడంగా ఉండవచ్చని అన్నారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ జాతీయస్థాయి కరాటే పోటీల్లో 16ఏళ్ల పైబడి విభాగంలో కటా బ్రౌన్, బ్లాక్‌బెల్టులో మహ్మద్ హుజేఫా షరీఫ్ గ్రాండ్ చాంపియన్‌షిప్, బంగారు పతకం, 17 ఏళ్ల విభాగంలో హఫ్సా బేగం కలర్ బెల్టు కటాలో గ్రాండ్ చాంపియన్, బంగారు పతకం, కలర్ బల్టులో ఆయేషా బేగం బంగారు పతకం, 13 ఏళ్ల విభాగంలో ఉమ్మె ఖిజ్రబేగం కలర్ బెల్టు కటాలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్నవీరయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురక్ష కళాబృంద సభ్యులు

గండేడ్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం సురక్ష పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మానవ అక్రమరవాణాపై అవగాహన కల్పించారు. బాలబాలికలు చదువుపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో కృషి చేయడంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పాటల రూపంలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలు, గిఫ్టులు వచ్చాయని, మీరు లక్కీ డ్రా లో గెలుపొందారని, ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే వాహనాలు, వస్తువులు దొరుకుతాయని మోసాలు జరుగుతున్నాయని వివరించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి లేదా మహబూబ్ నగర్ జిల్లా పోలీసు కంట్రోల్‌రూం నంబర్ 8712659360కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నజీర్, అశ్వకర్జిక్, హెచ్‌ఎం జనార్దన్, ఏహెచ్‌టీయూ టీం సభ్యులు వరప్రసాద్, కళాబృందం సభ్యులు రాములు, జగదీష్, శ్రీనివాస్, శివరాములు పాల్గొన్నారు.

శివ మాలధారులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న శ్రీదత్త కాలనీవాసులు

పాలమూరు: మహబూబ్‌నగర్ నుంచి శ్రీశైలం వెళ్తున్న శివమాలధారులకు పట్టణంలోని శ్రీదత్త కాలనీవాసులు పలురకాల పండ్లు పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్ రోడ్డుమార్గంలో పాదయాత్రతో వెళ్తున్న వారి కోసం రోడ్డుకు దగ్గర ప్రత్యేక టెంట్ ఏర్పాటుచేసి పండ్లు, తాగునీరు ఏర్పాటుచేసి అందించారు. కాలనీవాసులు ప్రవీణ్‌రెడ్డి, వేణుమాధవ్, వెంకట చారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆలూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా రక్షిత, విద్యామంత్రిగా వెన్నెల, ఆర్‌జేడీగా రామానంద్, కలెక్టర్‌గా గౌతమి, డీఈఓగా అవంతి, ఎంఈఓగా మౌనిక వ్యవహరించారు. వీరిని జీహెచ్‌ఎం యుగంధర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కార్మికుల హక్కులకోసం ఐఎన్‌టీయూసీ పోరాటం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్మికుల హక్కుల కోసం ఐఎన్‌టీయూసీ పోరాటం చేస్తుందని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జాతీయ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యులు డా. సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాములుయాదవ్ మాట్లాడుతూ నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం పనిచేసే నాయకుడు సంజీవరెడ్డి అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్, ఆయా కార్మిక విభాగాల ఐఎన్‌టీయూసీ నాయకులు డి.శ్రీనివాసులు, రాములు, మహేష్‌కుమార్, గోపాల్, వినయ్‌కుమార్, ఖాదర్, రాజు, ఆంజనేయులు, మైబూబ్, నాగరాజు, శ్రీనివాసులు, రాజశేఖర్, రామ్‌నాయక్, కురుమయ్య, రామానాయుడు, ఓంకార్, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో వివరాలు తెలపండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : జిల్లా కేంద్రంలోని మౌలాలిగుట్టలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు పొందిన దానిపై విచారణ చేపట్టారు. ఇందులో 98మంది వివరాలను తెలియలేదని మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వివరాలు తెలియని 98 మంది తమ వివరాలను ఏడు రోజుల్లోగా తహసీల్దార్ కార్యాలయంలో రాతపూర్వకంగా వివరాలు తెలపాని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నవాబుపేట: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని అమ్మపూర్, దరిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే సర్వే చేసినవారికి సంబంధించి స్థలం తదితర విషయాలు మరోసారి పరిశీలన చేశామన్నారు. అర్జీ పెట్టుకున్నవారి ఇంటి సర్వే చేయకపోతే వెంటనే మండల కార్యాలయంలో సమాచారం అందించి సర్వే చేయించుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట మండల, పంచాయతీ అధికారుల బృందం ఉన్నారు.

సేఫ్టీ కిట్లు పంపిణీ



జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం గీతకార్మికులకు అండగా ముందుకు సాగుతుందని ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి అన్నారు. మంగళవారం ఎక్సైజ్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ తాడి టాపర్స్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ 9మంది గీత కార్మికులకు కాటమయ్య రక్ష సేఫ్టీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలందరికీ నాణ్యమైన కల్లును అందించాలని గీతకార్మికులకు సూచించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఆర్.ఇందిర, డెవలప్‌మెంట్ అధికారి రషీద్, ఎక్సైజ్ ఎస్‌ఐలు నాగరాజు, శృతి, కార్తీక్, హెడ్‌కానిస్టేబుల్ మురళీమోహన్, చంద్రమౌళి, అనిల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

శివ భక్తుడికి గాయాలు

హన్వాడ: శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న ఓ శివభక్తుడికి రోడ్డు ప్రమాదంలో గాయాలైన ఘటన మంగళవారం మండల కేంద్రంలోని తాండూర్ ప్రధానరహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడెం తాలుకా కోనాపూర్‌కి చెందిన శివ అనే భక్తుడు రెండు రోజుల క్రితం పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరాడు. హన్వాడ సమీపంలో తాండూర్ నుంచి అతివేగంగా వస్తున్న లారీ శివ, మల్లప్ప అనే భక్తులను ఢీకొట్టింది. దీంతో శివ తల, కాళ్లు చేతులకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారుణమైన లారీని పట్టుకొని లారీని, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నేడు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

దేవరకద్ర: మండలంలో చిన్నరాజమూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బుధవారం మధ్యాహ్నం 3గంటలకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం సాయంత్రం 4 గంటలకు అడవి అజిలాపూర్ గ్రామంలో సీసీ రోడ్లు, యాదవ కమ్యూనిటీ భవనం, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజచేసి పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

శివాజీ జయంతి

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు లోకిరేవులో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు శ్రీను, రవి, రాజు, సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం లోకిరేవు గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాట్లు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

రైతులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్



మాట్లాడుతున్న న్యాయమూర్తి ముద్దసిర్

జడ్చర్ల టౌన్: రైతులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్ పిలుపునిచ్చారు. మండలంలోని చర్లపల్లిలో మంగళవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన రైతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విత్తనాలు కొనే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, ఏదైనా సమస్య వస్తే మండల న్యాయ సేవాసమితిని సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, న్యాయవాదులు పురుషోత్తం, ప్రశాంత్, సల్లరాములు, రైతులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, కోర్టు సిబ్బంది దేవ పాల్గొన్నారు.

వాకర్లకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వాకర్లకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. స్టేడియంలోని ట్రాక్‌పై దుమ్ము, ధూళి రాకుండా వారంలో కనీసం మూడుసార్లు కార్పొరేషన్ ట్యాంకర్ ద్వారా నీళ్లు చల్లుతామని అన్నారు. వాకింగ్ చేసేటప్పుడు దుమ్ము, ధూళి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయిస్తా

రాజాపూర్: మండలంలోని రాయపల్లి నుంచి పోలేపల్లి గ్రామానికి మధ్యనున్న మూడున్నర కిలోమీటర్ల రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయిస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. రాయపల్లి నుంచి పోలేపల్లికి మట్టిరోడ్డు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. బీటీ రోడ్డు మంజూరు చేయించాలని వారు కోరారు.


ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని వినతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరదగాలన్న ఆధ్వర్యంలో భవన నిర్మాణ రంగ కార్మికులు మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో ఇసుకను బడుగుబలహీనవర్గాలకు, ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా సరఫరా చే యాలని కోరారు. జిల్లాలో డీసీఎల్ ఆఫీసులో పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని, వెల్ఫేర్‌బోర్డులో అడ్వైజర్ సభ్యులు గా అన్నికార్మిక సంఘాల నుంచి నియమించాలన్నారు.

మునిరంగస్వామికి పూజలు



భూత్పూర్: పట్టణంలోని శ్రీమునిరంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మునిరంగస్వామి ప్రతిమతో ఇంటింటికి వెళ్లడం ఆనవాయితీ. దేవాలయానికి రాని భక్తుల సౌకర్యార్థం స్వయంగా మునిరంగస్వామి ప్రతిమను ఊరేగింపుగా, భజనలతో ఇంటింటికి వెళ్లి భక్తులకు సాహిత్యం (నైవేద్యం)తో అన్నదానం చేస్తారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. జాతరలో దుకాణాలతో పాటు బ్రేక్‌డ్యాన్స్, కొలంబర్, జంపింగ్‌లు భక్తుల ను ఆకట్టుకున్నాయి. భూత్పూర్‌కు చెందిన మురళీధర్‌గౌడ్ ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల్లో అన్న ప్రసాదం (అన్నదానం) చేస్తున్నారు.



పండుగలను ప్రశాంతంగా జరుపుకొందాం

- డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల టౌన్: రాబోయే పండుగలను అందరూ కలిసి ప్రశాంతంగా జరుపుకొందామని డీఎస్పీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బుధవారం శివాజి జయంతి, 26న శివరాత్రి, మార్చి 1నుంచి రంజాన్ మాసం ప్రారంభం, ఉగాది వేడుకలు ఉన్నందున ఒకరి మతాన్ని మరొకరం గౌరవించుకుందామన్నారు. ఎవరికీ ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించకూడదన్నారు. ఎవరైనా శాంతిభద్రతలను భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసమావేశంలో రూరల్ సీఐ నాగార్జునగౌడ్, పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బాండ్లు అందజేత



బాండ్లను అందిస్తున్న వీసీ శ్రీనివాస్, తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ(పీయూ)లో నాన్‌టీచింగ్ ఉద్యోగులుగా పనిచేసి ఇటీవలే రాజశేఖర్, దశాదేవి మరణించారు. రాజశేఖర్ భార్య సుకన్య, దశాదేవి భర్త సుభాష్‌గౌడ్‌కు ఒక్కొక్కరికి రూ.3.50లక్షలకు సంబంధించిన బాండ్లను వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పీయూలో సిబ్బందికి ఇబ్బందులు వస్తే ఆదుకుంటామని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, బోధనేతర సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, పర్వతాలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు

దేవరకద్ర: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఊర్మిళ మాట్లాడుతూ అధ్యాపకులు చెప్పే పాఠాలు విద్యార్థులు శ్రద్ధగా వినాలని అన్నారు. ఇష్టంగా చదివి కష్టపడి పరీక్షలు రాసి మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.